క్లుప్తంగా

వసతుల కల్పనపై దృష్టి సారించండి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

రుద్రవరం: మండల కేంద్రంలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని డీఎల్‌పీఓ రాంబాబు తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాగు నీటి సరఫరా,పారిశుధ్యం వంటి వాటిపై నిర్లక్ష్యం లేకుండా చూడాలని చెప్పారు. అలాగే గ్రామ అభివృద్ధికి ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దుకాణ లైసెన్స్‌లకు సంబంధించి రావాల్సిన బకాయిలను వసూలు చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి పీఎస్ చెన్నయ్య,సచివాలయ సిబ్బంది ఉన్నారు.

శిరివెళ్ల: కోటపాడు గ్రామ సచివాలయాన్ని డీఎల్‌పీఓ రాంబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజర్, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించి కులగణనపై ఆరా తీశారు. సచివాలయ పరిధిలో 1,724 గృహాలు ఉండంగా 52 శాతం సర్వే పూర్తియిందన్నారు.

50 శాతం కులగణన పూర్తి

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో చేపట్టిన కులగణన సర్వే 50 శాతం పూర్తయిందని డీఎల్‌డీఓ మురళీకల్యాణి బుధవారం తెలిపారు. ఇప్పటి వరకు 2,99,329 కుటుంబాలకు సంబంధించిన వివరాలు సేకరించామన్నారు. అన్ని సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే ద్వారా 6,82,881 మంది కులగణన పూర్తి చేశామన్నారు.

శిరివెళ్ల: మండలంలో కులగణన చురుకుగా జరుగుతుంది. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. మండలంలో 19,606 గృహాలు ఉండంగా ఇప్పటి వరకు 9,654 గృహాల్లో కులగణన పూర్తియ్యింది. మండలంలో అత్యధికంగా జీనేపల్లెలో 87 శాతం సర్వే పూర్తయ్యింది.

ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన శిక్షణ డీఎస్పీ



బిట్రా రఘువీర్

దొర్నిపాడు: ఆళ్లగడ్డ సబ్‌డివిజనల్ పరిధిలో డీఎస్పీగా శిక్షణ తీసుకుంటున్న బిట్రా రఘువీర్ రెండు వారాల పాటు దొర్నిపాడు ఎస్‌ఐగా విధులు నిర్వహించేందుకు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంతమార్కెట్ ప్రారంభానికి వచ్చిన ఏపీ జల వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని మార్యదపూర్వకంగా కలిశారు.

యువకుడిపై కత్తితో దాడి

నంద్యాల సాక్షి: వివాహ వేడుకలో నచ్చిన పాటను డీజేలో మార్చలేదనే కోపంతో నూర్‌బాషా అనే యువకుడిపై ఇద్దరు యువకులు కత్తితో దాడి చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. తాలుకా సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. నందమూరి నగర్‌కు చెందిన చిన్న అనే యువకుడు ఆదోని పట్టణానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తన ఇంటి వద్ద రిషప్షన్ ఏర్పాటు చేశాడు. వేడుకకు స్థానికంగా ఉండే నూర్‌బాషా, ప్రదీప్ గౌడ్, వసంత్ వచ్చారు. ముగ్గురు డీజే వద్ద డాన్స్ చేస్తున్న క్రమంలో తమకు నచ్చిన పాటను మార్చలేదనే కోపంతో ప్రదీప్‌గౌడ్, వసంత్ కలిసి నూర్‌బాషాపై కత్తితో దాడి చేశారు. గాయపడిన నూర్‌బాషాను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే రాక

నంద్యాల(అర్బన్): మండలంలోని చాబోలు గ్రామానికి గురువారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి రానున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఎస్‌ఏజీవై, ఇతర పథకాల కింద గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, డ్రైన్లను ప్రారంభిస్తారని చెప్పారు.

వెదురు స్వాధీనం

రుద్రవరం: చెలిమ రేంజి పెద్దకంబలూరు సెక్షన్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 1,500 వెదురు కర్రలను రుద్రవరం రేంజి సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. రేంజి అధికారి శ్రీపతినాయుడు తెలిపిన వివరాల మేరకు.. సెక్షన్ అధికారి నాగరాజు ఎఫ్‌బీఓలతో కలిసి అటవీ సంరక్షణలో భాగంగా అప్పనపల్లె వైపు వెళ్తుండగా పక్కనే ఉన్న పెద్దకంబలూరు సెక్షన్‌లో వెదురు కర్రలు నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో ఆయన సిబ్బందితో అక్కడికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకొని రుద్రవరం అటవీ కార్యాలయానికి తరలించారని చెప్పారు. అయితే దాడుల్లో దాదాపు 6వేల వెదురు కర్రలు పట్టుబడ్డాయని, అటవీ అధికారులకు కొంత మొత్తం ముట్టడంతో దాదాపు 4,500 కర్రలను వదిలేసి వచ్చారని ఆరోపణలు వైరల్ కావడంతో ఈ విషయంపై శ్రీపతినాయుడును వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, విచారణ చేసి ఆరా తీయిమని చెప్పారు.

క్షేత్రస్థాయిలో తిరిగితే అభివృద్ధి కనిపిస్తుంది

- ఏసీ రూముల్లో కూర్చొని మాట్లాడితే ఎలా?
- ఎంపీ పోచా, గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి
- నూతన సంతమార్కెట్ ప్రారంభం



నూతన సంతమార్కెట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: ఏసీ రూముల్లో కూర్చొని అభివృద్ధి జాడేదీ అంటూ విమర్శించడం వల్ల లాభం లేదని, క్షేత్రస్థాయిలో పర్యటించి చూస్తే ఎంత మేర అభివృద్ధి చెందిందో తెలుస్తుందని రాష్ట్ర జలనవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రం దొర్నిపాడులో రూ.15లక్షలు నాబార్డు, రూ.10 లక్షలు గ్రామ పంచాయతీ నిధులతో శ్రీపరమేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన సంతమార్కెట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బురదలో సంతమార్కెట్‌ను నిర్వహించే వారన్నారు. మార్కెట్ నిర్మాణంలో నాబార్డు సహకారం మరువలేనిదన్నారు. అహోబిలం ప్రాంతాల్లో తేనే పెంపకం ఏర్పాటుకు, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నూతన సంత మార్కెట్‌ల అభివృద్ధికి సహకరించాలని నాబార్డు డీజీఎం మురారి మోహన్ బెహరను కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. నాబార్డు సహకారంతో దేశంలోనే తొలిసారిగా ఉయ్యాలవాడలో గోదాంను నిర్మించామని చెప్పారు. అలాగే చాకరాజువేముల– డబ్ల్యూ గోవిందిన్నె, ఉయ్యాలవాడ, శిరివెళ్ల, చాగలమర్రి మండలాల్లో నాబార్డు సహకారంతో రోడ్లు వేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆళ్లగడ్డ శిల్పాకళాకారులకు, రైతులకు, గ్రామీణ ప్రాంత అభివృద్ధికి వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, శ్రీపరమేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ మోహన్‌రాజు, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, సర్పంచ్ సానిక దేవమణి, ఎంపీటీసీ లక్ష్మిదేవి, పీఏసీఎస్ చైర్మన్ నర్సిరెడ్డి, వైఎస్సార్‌సీపీ వైస్ ప్రెసిడెంట్స్ మోహన్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, మనోహర్‌రెడ్డి, శివరామిరెడ్డి, జాకీర్‌బాషా, శాంతయ్య, చిన్నమద్దిలేటి, డీలర్ శివుడు, గోపాల్. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి

నంద్యాల సాక్షి: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయాలు, తరలింపు లాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. దొంగతనాల నివారణ కోసం రాత్రి గస్తీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ప్రధాన రహదారులపై వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, డ్రంకెన్ డ్రైవ్, గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రార్థనా మందిరాల వద్ద

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నంద్యాల సాక్షి: ఈనెల 26వ తేదీన జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లను బుధవారం అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ చంద్రబాబుతో కలిసి పరిశీలించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామని వివరించారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్

ఆళ్లగడ్డ: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు పాటించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నంద్యాల ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. నూతన ఓటరు జాబితాను 295 పోలింగ్ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉంచామన్నారు. క్షుణ్ణంగా పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫాం -7 ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఏఆర్‌ఓ, తహసీల్దార్ హరినాధరావు, ఎన్నికల డీటీ చంద్రశేఖర్ ఉన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



హెల్ప్‌లైన్ నంబర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల టౌన్: నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక మధుమణి ఆసుపత్రిలో జాతీయ బాలిక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్లు అరుణకుమారి, సుసుమ, శైలజల నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో శిల్పా మహిళా సహకార్ చైర్‌పర్సన్ నాగినిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, మాజీ రాష్ట్ర అధ్యక్షుల ఫోరం చైర్మన్ డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, తల్లిదండ్రులు బాలికలను వారు ఎంచుకున్న రంగంలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం మిషన్ పింక్ హెల్ప్ లైన్ నంబర్ 8688475241 ను ఆవిష్కరించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న బాలికలు, మహిళలు ఈ హెల్ప్ లైన్ ద్వారా వైద్యుల సూచనలు, సలహాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షురాలు డాక్టర్ వసుధ, డాక్టర్లు పనిల్ కుమార్, సహదేవుడు, మధుసూదనరావు, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): బాలురతో పోటీగా బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ (ఐసీడీఎస్) పీడీ నిర్మల తెలిపారు. మదర్ సొసైటీ ప్రెసిడెంట్ రామారావు, వరల్డ్ విజన్ ప్రాజెక్టు ఆఫీసర్ తిరుపతిరావు, బర్డ్స్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయ ఆవరణలో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎటువంటి సంఘటనలకు భయపడకుండా ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారదా, హెచ్‌ఎం ఫాసుద్దీన్, ఎంఈఓ శివరాంప్రసాద్, రత్నకుమారి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.


మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా



పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, పీపీ నాగిరెడ్డి

గోస్పాడు: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వైఎస్సార్ ఆసరా పథకం ఎంతగానో దోహద పడుతుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ఆసరా చెక్కులను రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర సందర్భంగా రాష్ట్రంలోని పేదింటి అక్కాచెల్లెమ్మల కష్టాలను ప్రత్యక్షంగా చూసి వారికి ఇచ్చిన మాట మేరకు హామీలను నెరవేరుస్తున్నారని చెప్పారు. మండలంలోని స్వయం సహాయక సంఘాలకు నాల్గో విడత కింద రూ.5.65కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రికి అందరూ అండగా నిలవాలని కోరారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ ముక్కమల్ల ప్రహ్లాదరెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శకుంతలమ్మ, ఎంపీపీ ఆర్థర్‌సైమాన్, ఉప మండలాధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థలో డ్రైవర్లే కీలకం



మాట్లాడుతున్న శివారెడ్డి

నంద్యాల టౌన్: ప్రజా రవాణా వ్యవస్థలో డ్రైవర్లది కీలక పాత్ర అని జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి తెలిపారు. బుధవారం డ్రైవర్స్ డే సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ మనుగడ డ్రైవర్ల పైనే ఆధారపడి ఉందన్నారు. డ్రైవర్లు వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం డ్రైవర్లను అభినందించి ప్రోత్సాహకాలు అందజేశారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, స్టేషన్ మేనేజర్ తిమ్మయ్య, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం..

ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన సేవలు అందించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 9959225800కు ఫోన్ చేసి ప్రయాణికులు సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలి



సెబ్ అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు

నంద్యాల సాక్షి: జిల్లాలో నాటుసారా విక్రయం, తయారీని పూర్తిగా నిర్మూలించేందుకు సమష్టిగా కృషి చేద్దామని జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సెబ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆయా స్టేషన్ల పరిధిలోనున్న ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలను గుర్తించాలని ఆదేశించారు. నాటుసారా తయారు చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపాలని, నాటుసారా రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి మద్యం తరలించే వారిపై నిఘా ఉంచాలని చెప్పారు.

అనధికార లేఅవుట్లపై కఠిన చర్యలు



అనధికార లేఅవుట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న సూర్యనారాయణరెడ్డి

ఆళ్లగడ్డ: మున్సిపల్ అనుమతి లేకుండా అనధికార లేఅవుట్లు వేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని కుడా వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. పట్టణ పరిధిలో అనధికారంగా వేసిన ఐదు లేవుట్లను బుధవారం పరిశీలించి వాటి యాజమానుల నుంచి వివరణ తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా వేసిన లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేస్తే విక్రయించిన వారు, కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడతారని చెప్పారు. కొనే ముందు వాటికి అన్ని రకాల అనుమతులు ఉన్నాయో లేదో పత్రాల ద్వారా రూఢీ చేసుకున్న తరువాతనే కొనుగోలు చేయాలన్నారు. పట్టణ పరిధిలో సుమారు 25 లేఅవుట్లను అనుమతులు లేకుండా వేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: అడవి పందుల దాడిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటనురుద్రవరం సెక్షన్ అధికారి నాగరాజు, ఎఫ్‌బీఓ నరేంద్రగౌడు, వ్యవసాయ వీఏఏ ఫణీంద్ర బుధవారం పరిశీలించారు. రుద్రవరానికి చెందిన బోయ పక్కీరయ్య అనే రైతు వెలగలపల్లె పొలిమేరలో రెండెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. ప్రస్తుతం పంట దిగుబడి దశలో ఉంది. ఈ దశలో అడవి పందులు దాడి చేసి 0.70 సెంట్లలో పంటను ధ్వంసం చేశాయి. బాధిత రైతు స్థానిక అటవీ కార్యాలయంలో రేంజి అధికారి శ్రీపతినాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆయన పంట నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశించడంతో ఫారెస్టర్ పరిశీలించారు.

నైపుణ్యాలను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్ర



క్రీడాపోటీల అంబాసిడర్లతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నంద్యాల(సిటీ): యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్ర వేదికగా మారిందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ప్రారంభించారు. పోటీలకు అంబాసిడర్లుగా నియమించిన అర్షద్(బ్యాడ్మింటన్), మిద్దె శిశిర గ్రేస్(ఫెన్సింగ్ జాతీయ స్థాయి), మనోజ్‌కుమార్(అథ్లెటిక్స్), రాఘవ(హాకీ) క్రీడాకారులను అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ పీపీ మధుసూధన్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, కమిషనర్ రవిచంద్రారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ పాల్గొన్నారు.

ప్రమీళ మృతి కారకులకు శిక్ష తప్పదు

- నిరాధార ఆరోపణలు చేస్తే సహించం
- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణ శివారులోని పాండురంగాపురం వద్ద ఉన్న శిల్పా వెంచర్‌లో గత శుక్రవారం బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు సరికాదని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పద్మావతినగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.అయన మాట్లాడుతూ తమ వెంచర్లలో ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న ఏసేపు కుమార్తె ప్రమీళ (14) మరణానికి కారకులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశానన్నారు. మా కుటుంబ సభ్యులుగా ఉన్న బాలిక మరణం మమ్మల్ని కలచి వేసింది. దీనిపై అఖిలప్రియ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు. మృతిపై ఎలాంటి విచారణకైనా సిద్ధమన్నారు. పసలేని ఆరోపణలతో ప్రజలను మభ్యపెడుతూ రాజకీయంగా లబ్ధి పొందాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే వెంచర్‌లోని సీసీ పుటేజీలను పోలీసులకు అందించామని చెప్పారు. రీ పోస్టుమార్టం చేసి సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాలని సూచించడం మంచిదే కానీ.. రాజకీయంగా లబ్ధిపొందేలా చూస్తే సహించేదిలేదన్నారు. సమావేశంలో శిల్పా భువనేశ్వరరెడ్డి, నాయకులు ఉన్నారు.

నంద్యాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం



శిలాఫలకాలన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(సిటీ): నంద్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 42వ వార్డులో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కౌన్సిలర్ శిరీష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కిరణకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్య పరిష్కారంలో భాగంగా సీసీ రోడ్డును నిర్మించామన్నారు. నియోజకవర్గంలో ఇదివరకే రూ.14.40కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మున్సిపల్ పరిధిలో రూ.8.40 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. రాష్ట్ర సోషల్ మీడియా కో ఆర్డినేటర్ పీపీ మధుసూదన్‌రెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చిమ్మ నాగన్న, కౌన్సిలర్లు సాదిక్‌బాషా, లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి, శివ, తిరుపాల్, కుమ్మరి రాముడు, ఓబులపతి, సల్మాన్‌రాజు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యకర సమాజం



పోటీలను పర్యవేక్షిస్తున్నఎంపీ పోచా, గంగుల, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు ఆరోగ్య సమాజ నిర్మాణమే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అర్బన్, రూరల్ సచివాలయాల పరిధిలోని మండల స్థాయి పోటీల ముగింపు సందర్భంగా బుధవారం పోటీలను తిలకించారు. కమిషనర్ రమేష్ బాబు, తహసీల్దార్ హరినాథరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

శిరివెళ్ల: మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం, మండల పరిషత్, జెడ్పీ, గ్రామ పంచాయతీ నిధులు రూ.2 కోట్లతో సిమెంట్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలు జరిగాయి. తాజాగా రూ.8 లక్షలతో ప్రధాన వీధిలో డ్రైనేజీ కాల్వ నిర్మాణం చురుకుగా సాగుతోంది.

ఆలయాభివృద్ధికి విరాళం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నాగులకట్ట దేవాలయ అభివృద్ధికి ఆర్యవైశ్య నాయకుడు గోళ్ల రాజేంద్రప్రసాద్ రూ.లక్ష విరాళంగా ఇచ్చారని ఆలయ నిర్వాహకులు బొగ్గరపు నారాయణ బుధవారం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

శిరివెళ్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నుంచి శిరివెళ్లకు అక్రమంగా రవానా చేస్తుండగా దాడి చేసి శిరివెళ్ల మెట్ట వద్ద పట్టుకున్నామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): సెర్ప్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని నంద్యాల జిల్లా జేఏసీ నాయకులు మిద్దె పుల్లయ్య, వాడాల రవికుమార్, దానం ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట దీక్ష చేపట్టారు. .

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా బుధవారం సమీపంలోని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీరాజారజేశ్వరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలను ఒకేషనల్ ఇండస్ట్రీయల్ టూర్‌లో భాగంగా సందర్శించారు. సుమారు 150 మంది విద్యార్థిని, విద్యార్థులు కళాశాలలో వృత్యంతర శిక్షణకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు.

జగనన్నకు మద్దతునిద్దాం

నంద్యాల(అర్బన్): ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తున్న జగనన్నకు మద్దతుగా నిలవాలని నంద్యాల జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు యూనస్ బాషా పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఖాజీలకు మూడేళ్ల కాల పరిమితి ఉండేదని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదేళ్లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ఖాజీల కాలపరిమితి పెంపు ఈనెల 22 నుంచి అమలులోకి రావడం అభినందనీయమన్నారు.

మోటారు సైకిల్, కారు ఢీ ఇద్దరికి గాయాలు

చాగలమర్రి: మండల కేంద్రం సమీపంలోనున్న టోల్ ప్లాజా వద్ద బుధవారం రాత్రి మోటారు సైకిల్, కారు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన ఇద్దరు చాగలమర్రి నుంచి తమ గ్రామానికి మోటారు సైకిల్‌పై మద్యం బాటిళ్లతో వెళ్తుండగా, ఆళ్లగడ్డ వైపు నుంచి చాగలమర్రికి విధులు ముగించుకొని ఇద్దరు కానిస్టేబుళ్లు మోటారు సైకిల్‌పై వస్తుండటాన్ని చూసి భయపడి మోటార్ సైకిల్‌ను వెనక్కు మళ్లిచారు. ఈ క్రమంలో కడపలో పనులు ముగించుకొని వస్తున్న ఆళ్లగడ్డ సబ్ జైలు సిబ్బంది కారును ఢీ కొట్టారు. సమాచారం అందుకున్న చాగలమర్రి పోలీసులు ప్రమాదంలో దెబ్బతిన్న కారును పోలీసు స్టేషన్‌కు తరలించి, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కేరళా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు



వుశేనయ్య స్వామి దర్గా వద్ద పెద్దపులి పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

రుద్రవరం: అటవీ ప్రాంత సమీపంలోనున్న రైతులు వన్య ప్రాణులకు హాని తలపెట్టరాదని రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు సూచించారు. మండల కేంద్రంలో సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న వుశేనయ్య స్వామి దర్గా పరిసరాల్లో బుధవారం తెల్లవారుజామున పెద్దపులి సంచరించిన పాద ముద్రలను రైతులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే రేంజర్ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి పెద్దపులి పాద ముద్రలను గమనించారు. ఆహార అన్వేషణలో భాగంగా అడవిలో నుంచి బయటకు వచ్చి తిరిగి లోపలికి వెళ్లిందని, ఆందోళన చెంద వద్దని చెప్పారు. పెద్ద పులి సంచరిస్తోందని పొలాల గట్లకు ఉచ్చులు అమర్చడం, కరెంటు కంచె ఏర్పాటు చేయరాదన్నారు. అడవి జంతువుల ద్వారా పంట నష్టం వాటిల్లితే తమ దృష్టికి తీసుకొస్తే, వాటికి తగిన పరిహారం అందించి ఆదుకుంటామని హామీనిచ్చారు. ఫారెస్టర్ నాగరాజు ఉన్నారు.